క్లుప్తంగా

'వైఎస్సార్‌సీపీ వర్ధంతిని విజయవంతం చేయండి'

బొండపల్లి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమం మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్నామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరుకావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, ఎంపీపీ చల్లా చలంనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్. రామచంద్రాపురంలో..

దత్తిరాజేరు: మండలంలోని ఆర్. రామచంద్రాపురంలో ఈ నెల 2వ తేదీన దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి వర్ధంతి నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు మంత్రి అప్పలనాయుడు, పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరై వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

తాడేలను వరించిన కళారత్న అవార్డు


కళారత్న అవార్డు అందుకుంటున్న తాడేల శంకరరావు

మెరకముడిదాం: మండలంలోని భైరిపురం గ్రామానికి చెందిన తాడేల శంకరరావుకు విశాఖపట్టణానికి చెందిన ప్రతిభా క్రీడా, సాంస్కృతిక సంస్థ ఆదివారం ప్రతిభా గాన కళారత్న అవార్డు అందజేసింది. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ప్రతిభ అడవిరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శంకరరావును సత్కరించారు. సన్మానగ్రహీత ఖవ్వాలి పాటలు పాడుతూ ఖవ్వాలి దాసుగా అందరికీ సుపరిచితుడు. దీంతో శంకరరావును పలువురు సాహితీ అభిమానులు అభినందించారు.

కుట్రలో అందరూ భాగస్వాములే..


బొద్దవరలో ఆందోళన చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: జిందాల్ సాగిస్తున్న కుట్రలో ప్రభుత్వ పెద్దలందరూ భాగస్వాములేనని జిల్లా రైతు సంఘ అధ్యక్షుడు చల్లా జగన్ ఆరోపించారు. జిందాల్ నిర్వాసితులు బొద్దవరలో మోకాళ్లపై నిల్చొని ఆదివారం నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్ల కిందట రైతుల దగ్గర నుంచి భూములు లాక్కొని ఎటువంటి పరిశ్రమ ఏర్పాటు చేయకుండా జిందాల్ యాజమాన్యం మోసం చేసిందన్నారు. పైగా సేకరించిన భూములను ప్లాట్లుగా అమ్ముకుంటానంటే జిందాల్‌కు ప్రభుత్వం రాయితీలు కల్పించడం చూస్తుంటే.. నాయకులకు ఏ మేర ముడుపులు ముడుతున్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. రైతులకు న్యాయం చేయకపోతే ఆందోళనను తీవ్రం చేస్తామని స్పష్టం చేశారు.


అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి

సమస్యల వలయంలో వేపాడ

- అధ్వానంగా ప్రధాన రహదారి
- పల్లె వెలుగు బస్సులకు నోచుకోని మండల కేంద్రం
- పట్టించుకోని అధికారులు


రోడ్డు విస్తరణలో తొలగించిన ఇళ్ల ముందు భాగాలు

వేపాడ: మండల కేంద్రం పలు సమస్యలతో సతమతవుతోంది. పాలకులు గాని అధికారులు గాని పట్టించుకోకపోవడంతో ప్రజలు మండిపడుతున్నారు. రెండేళ్లుగా అధ్వాన ర హదారిపై రాకపోకలు సాగిస్తున్నా అధికారుల్లో చలనం లేదు. నాటి కలెక్టర్ పూనం మాలకొండయ్య చొరవతో మండల కేంద్రంలో ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించారు. అలాగే అప్పటి ఎమ్మెల్యే శోభా హైమావతి చొరవతో సోంపురం – ఆనందపురం వయా వేపాడ రహదారి అభివృద్ధి జరిగింది. అలాగే సోంపురం వద్ద రైల్వే బ్రిడ్జి ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఎటువంటి అభివృద్ధి జరగలేదు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాత్రం సోంపురం – ఆనందరపురం వయా వేపాడ రహదారి (16.4 కిలోమీటర్లు) అభివృద్ధికి ఎన్‌డీబీ నిధులు రూ. 36 కోట్లు మంజూరయ్యాయి. అయితే కాంట్రాక్టర్ 12 కిలోమీటర్ల మేర తారు రోడ్డు వేసి ఎడాదిన్నర దాటిపోతున్నా తిరిగి పనులు చేపట్టడం లేదు. అలాగే వేపాడ, సోంపురం, అరిగిపాలెం గ్రామాలో డ్రైనేజీలు నిర్మించాల్సి ఉంది. అయినప్పటికీ అటు అధికారులు గాని ఇటు పాలకులకు గాని పట్టించుకోకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి..



చెప్పుకోవడానికే మండల కేంద్రం. ప్రజలకు బస్సు సౌకర్యం లేదు. ఆటోల్లోనే ప్రయాణించాల్సిన పరిస్థితి. ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇంటికి చేరుకోవాలంటే నానా అవస్థలు పడుతున్నాం. ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. అధికారులు, పాలకులు స్పందించాలి.
– నిరుజోగి నాయుడు, వేపాడ

పల్లె వెలుగు కరువు..

నిత్యం వేపాడ మండల కేంద్రానికి ఉద్యోగులు, వ్యాపారులు, వివిధ పనుల మీద ప్రజలు వస్తుంటారు. అయితే మండల కేంద్రానికి కనీసం పల్లెవెలుగు బస్సు సౌకర్యం కూడా లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించక తప్పని పరిస్థితి. మండలాన్ని ఏనాడూ జిల్లా అధికారులు సందర్శించే దాఖలాలు లేవు. ఎప్పుడో ఒకప్పుడు అధికారులు వచ్చినా తూతూమంత్రంగా కార్యాలయాల్లో అడుగుపెట్టి వెళ్లిపోతున్నారు.

55 వేల జనాబా..

ఎన్నికలు వస్తే వేపాడ మండలం మా పార్టీకి కంచుకోట అంటే.. మా పార్టీకి కంచుకోట అని చెప్పుకునే నాయకులు అధికారం వచ్చాక మండలం అభివృద్ధికి మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. మండల కేంద్రానికి రావాలంటే కొండగంగూబూడి నుంచి 20 కిలోమీటర్లు.. వావిలపాడు నుంచి 12.. నల్లబిల్లి నుంచి 10.. కుమ్మపల్లి, కేఆర్ పేట నుంచి రావాలంటే 10 నుంచి 13 కిలోమీటర్లు ఆటోల్లో ప్రయాణించాలి. అలాగే వీలుపర్తి, వెల్దాం, చామలడవి, దబ్బిరాజుపేట, కరకవలస, చామలాపల్లి, ఆతవ, శింగరాయి, చినగుడిపాల, జమ్మాదేవిపేట, తదితర గ్రామాల ప్రజలు వేపాడ ప్రధాన రహదారి మీదుగానే రాకపోకలు సాగించాల్సి ఉంది. అయితే ప్రధాన రహదారి అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



వేపాడ శివారు బక్కునాయుడుపేట రోడ్డు అధ్వానంగా మారింది. మూడు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1500 మంది విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను చూసేందుకు ప్రతి వారం పాఠశాలలకు వస్తుంటారు. దీంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు సదుపాయం కల్పించాలి.
– గొంప రమణ, రైతు, బక్కునాయుడుపేట, వేపాడ మండలం

డ్రైనేజీలు పూర్తి చేయండి..



వేపాడలో రోడ్డు విస్తరణ పేరిట ఇళ్ల గుమ్మాలు, అరుగులు తొలగించారు. ఏడాదిన్నర అయినా ఇంతవరకు కాలువలు నిర్మించలేదు. ఇళ్ల మెట్లు తొలగించడంతో వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు వేయకపోయినా కనీసం కాలువలైనా నిర్మించి ఇబ్బందులు తీర్చండి.
– నెక్కల రమణమ్మ, గృహిణి, వేపాడ

సమస్యలివే..

మండల కేంద్రానికి బస్సు సౌకర్యం లేదు. అనకాపల్లి, విజయనగరం, విశాఖ ప్రాంతాలకు ఇక్కడ నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. వేపాడ ప్రధాన రహదారితో పాటు వేపాడ – ఆనందపురం, బక్కునాయుడుపేట రోడ్డును అభివృద్ధి చేయాలి. మండల వ్యవసాయ కేంద్రం భవనం కారిపోతోంది. మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఆయుర్వేదిక్ ఆస్పత్రికి సొంత భవనం లేకపోవడంతో ఇరుకు గదుల్లో వైద్యసేవలు అందిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, పాలకులు, స్పందించి సమస్యలు పరిష్కరించాలని మండల వాసులు కోరుతున్నారు.

రోడ్డుపై భారీ గుంత

వేపాడ: మండలంలోని సోంపురం – అరిగిపాలెం రహదారిపై భారీ గుంత ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలో నీరు చేరడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులో గుంతలో పడి క్షతగాత్రులుగా మారుతున్నారు. మండల అధికారులు నిత్యం ఇదే రోడ్డు మీదుగా తిరుగుతున్నా కనీస స్పందన లేకపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


సోంపురం – అరిగిపాలెం రహదారి దుస్థితి

గణపతిని దర్శించుకున్న కడుబండి

శృంగవరపుకోట: పట్టణంలో గాంధీపార్కులో ఏర్పాటు చేసిన గణపతిని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు స్థానిక నాయకులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, వాకాడ రాంబాబు, బుగతా వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు కడారి అప్పయ్య, మండల యువజన విభాగం అధ్యక్షుడు వాకాడ సతీష్, పెంట గణేష్, కె.జయశంకర్, తదితరులున్నారు.


వినాయకుడ్ని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు

కళ తప్పిన చంపావతి

గజపతినగరం: మండలంలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందించే చంపావతి నది కళావిహీనంగా తయారైంది. నది పూర్తిగా పిచ్చిమొక్కలు, తుప్పలతో నిండిపోవడంతో నీరు ప్రవహించలేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి నదిలోని తుప్పలు తొలగించి నీరు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని సీతారామపురం, కాలంరాజుపేట, పిడిశీల, దోలపాలెం, ముద్దూరు, బొండపల్లి, తదితర గ్రామాలకు చెందిన అన్నదాతలు కోరుతున్నారు.


పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న చంపావతి నది

సన్మానం

శృంగవరపుకోట: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో కంట్రోలర్, కండక్టర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన వజ్రపు వెంకటరమణను ఆదివారం స్థానిక ఆర్టీసీ డిపోలో సహోద్యోగులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమానికి నెల్లూరు డిపో చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె.రమేష్ ముఖ్య అతిథిగా హాజరై రమణకు జ్ఞాపికను బహూకరించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరింటిండెంట్ వెంకటరావు, రమణ, తదితరులు పాల్గొన్నారు.


వెంకట రమణను సన్మానిస్తున్న ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు

యువత క్రీడల్లో రాణించాలి

- ఎంపీపీ పీరుబండి హైమావతి

గంట్యాడ: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. మండలంలోని రామవరంలో వాలీబాల్ కోర్టును ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగాలు పొందవచ్చన్నారు. క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం సిద్ధిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, సర్పంచ్ పీరుబండి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించినా ఫిర్యాదు చేస్తున్నారు..

గుర్ల: మండలంలోని మణ్యపురిపేటలో టీడీపీ నాయకుడు నిర్మించిన అంగన్‌వాడీ భవనానికి సంబంధించి రూ. 1.57 లక్షలను 2020లో చెల్లించినప్పటికీ తరచూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నాడని సర్పంచ్ బడుగంటి హైమవతి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ పెద్దల అండదండలతో కావాలనే ఫిర్యాదు చేస్తున్నాడని వాపోయారు. గ్రామాభివృద్ధిపై దృష్టి సారించకుండా ఇలా తప్పుడు ఫిర్యాదులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

సంక్షేమ పథకాలు వివరించండి


మన్‌కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గజపతినగరం: భారతీయ జనతా పార్టీ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఏడుకొండలు తెలిపారు. మండల కేంద్రంలోని పార్టీ మండల ఉపాధ్యక్షుడు వేమలి సత్యనారాయణ ఇంటి వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన మన్‌కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా.. కేంద్ర ప్రభుత్వానికి పేరు రావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.భాస్కర్, ఉపాధ్యక్షుడు వి.సత్యనారాయణ, ప్రకాష్, గోపి, శ్రీధర్, తవిటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు


కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న ఎంపీపీ హైమావతి, తదితరులు

- ఎంపీపీ హైమావతి, జెడ్పీటీసీ సభ్యుడు నరసింహమూర్తి

గంట్యాడ: పిల్లను ఇచ్చిన మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను కూడా వెన్నుపోటు పొడిచారని ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహమూర్తి ఆరోపించారు. మండలంలోని రామవరంలో 'బాబు షూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. చంద్రబాబు ప్రభుత్వం కేవలం ధనికుల కోసమే పనిచేస్తోందన్నారు. కూటమి నాయకులు ఇష్టానుసారంగా ఇసుక, గ్రావెల్ దోచేస్తున్నారని ఆరోపించారు. ఊరికి 50 చొప్పున బెల్ట్‌షాపులు వెలిశాయన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతులకు యూరియా అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. సెర్ప్ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ జిల్లాకు చెందిన వాడైనప్పటికీ ఇంతవరకు ఒక్క కొత్త పింఛన్ కూడా ఇవ్వలేదన్నారు. రీ వెరిఫికేషన్ పేరుతో అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తీసేశారని మండిపడ్డారు. దివ్యాంగులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న కూటమి నాయకులు ఇంతవరకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలన్నారు. ఆడబిడ్డ నిధి పథకానికీ అతీగతీ లేకుండా పోయిందన్నారు. కూటమి పాలనను ప్రశ్నించిన వారిని రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, సర్పంచ్ పీరుబండి పద్మ, యువజన విభాగం అధ్యక్షుడు కె. విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు పి. వెంకటరావు, రైతు విభాగం కార్యదర్శి జాగరపు సత్యారావు, పార్టీ నాయకులు కృష్ణంరాజు, పి.నారాయణమూర్తి, లచ్చిరెడ్డి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


లక్కవరపుకోట మండలం సోంపురం జంక్షన్ సమీపంలో గల ఎరువుల షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు


వేపాడ: కొండగంగుబూడి రైతుసేవా కేంద్రంలో స్టాకు పరిశీలిస్తున్న అధికారులు

లక్కవరపుకోట: మండలంలోని సోంపురం జంక్షన్, వేపాడ మండలం బొద్దాం జంక్షన్‌లో గల ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బి. సింహాచలం ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా స్టాక్, రికార్డులను పరిశీలించారు. ఎంఆర్‌పీకి మించి అమ్ముతున్నదీ, లేనిదీ ఆరా తీశారు. అధిక ధరలకు విక్రయించినా, నాసిరకం ఎరువులు అంటగట్టినా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో లక్కవరపుకోట, వేపాడ మండల వ్యవసాయాధికారులు వి.హరికృష్ణ, ఎం.స్వాతికుమారి, విజిలెన్స్ సిబ్బంది ఎ.కామేశ్వరరావు, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు..

వేపాడ: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏఓ ఎం.స్వాతి, విజిలెన్స్ సీఐ బి. సింహాచలం అన్నారు. మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్లను తనిఖీ చేసి స్టాకుతో సరిపోల్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రైతులు అడిగిన ఎరువులు మాత్రమే ఇవ్వాలన్నారు. అనంతరం కొండగంగుబూడి రైతుసేవా కేంద్రాన్ని సందర్శించి స్టాకు పరిశీలించారు. కార్యక్రమంలో విజిలెన్స్ సిబ్బంది కామేశ్వరరావు, పురోషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

కోమటిపల్లిలో భారీ అన్నసమారాధన


అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు


వేపాడ: అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు, పెద్దలు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి వినాయక మంటపం వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు 15 వందల మంది భక్తులు హాజరై స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఏర్పాట్లను కమిటీ సభ్యులు మామిడి రాజు, చంద్రరావు, రామకృష్ణ, రవి, శంకర్, తదితరులు పర్యవేక్షించారు.

బానాదిలో..

వేపాడ: మండలంలోని బానాదిలో పరదేశమ్మ ఆలయంలో కొలువదీరిన గణనాథుని మంటపం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. చలుమూరి, గుమ్మడి, చప్ప కుటుంబాలకు చెందిన పెద్దల సారథ్యంలో అన్నదానంలో బానాది, ఎం.శింగవరం, రెడ్డిపాలెం, ఆతవ, బల్లంకి గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


ఆనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

కొత్తవలస: మండలంలోని వియ్యంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000 – 2005 విద్యా సంవత్సరాల్లో ఆరు నుంచి పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ కలయిక పేరిట పాఠశాల ఆవరణలో ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకుంటూ సందడిగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సత్కరించారు.


గరివిడి: ఆత్మీయ కలయికలో భాగంగా కాపుశంభాం ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గరివిడిలో..

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలం కాపుశంభాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదేళ్ల కిందట పదో తరగతి చదువుకున్న విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆదివారం కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. ఆర్థికంగా చితికిపోయిన తోటి స్నేహితులను ఆదుకోవాలని ఈ సందర్భంగా నిర్ణయించుకున్నారు.